క్లుప్తంగా

జీపీ కార్మికులకు వైద్య పరీక్షలు


కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నరేందర్

ఆమనగల్లు: స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పరీక్షిత్ నరేందర్ పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ వసంత, వైద్య సిబ్బంది తిరుపతి రెడ్డి, వేణు, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెట్రోను ఆమనగల్లు వరకు పొడిగించాలి


కేశవులు

ఆమనగల్లు: 'రాష్ట్ర ప్రభుత్వం రెండో దశ మెట్రో రైలు విస్తరణకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఫోర్త్ సిటీ వరకు చేపట్టే మెట్రో రైలు మార్గాన్ని.. ఆమనగల్లు వరకు పొడిగించాలి' అని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు ముఖ్యమంత్రిని కోరారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి మహర్దశ కలిగిందన్నారు. ముచ్చర్ల సమీపంలో ఫోర్త్‌సిటీ ఏర్పాటుతో కడ్తాల, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాలు వేగంగా అభివృద్ధి చెందనున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. ప్రస్తుత సీఎం రేవంత్.. దక్షిణ తెలంగాణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని వెల్లడించారు. అందులో భాగంగానే ఏర్పాటు చేయనున్న ఫోర్త్‌సిటీ, రీజినల్ రింగ్‌రోడ్డు, రేడియల్ రోడ్ల నిర్మాణంతో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు మేలు జరగనుందని వివరించారు.

ఎంఈఓకు ఉపాధ్యాయ సంఘాల సత్కారం


ఎంఈఓ సర్దార్‌నాయక్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఆమనగల్లు: మండల విద్యాధికారిగా పనిచేసి, మాడ్గుల ఎంఈఓగా బదిలీ అయిన సర్దార్‌నాయక్‌ను పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం ఉపాధ్యాయ సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు. అనంతరం సర్దార్‌నాయక్ సేవలను కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, బోధనా నైపుణ్యం పెంపొందించడానికి అనేక కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు ఎంఈఓ పాండు, స్థానిక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామలక్ష్మి, పద్మ, తపస్ జిల్లా అధ్యక్షుడు కాశీరావ్, ఎస్టీయూ మండల అధ్యక్షుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మల్లేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కష్టజీవుల సమస్యలపై నిరంతర పోరాటం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ


పార్టీలో చేరిన వారితో జాన్‌వెస్లీ

మంచాల: కష్టజీవుల హక్కుల కోసం సీపీఎం నిరంతర పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. మండల పరిధి చిత్తాపూర్ గ్రామంలో సోమవారం నిర్వహించిన పార్టీ గ్రామ మహాసభలో ఆయన మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాయుధ పోరాటం చేసిన ఘనత కమ్యూనిస్టులదేనన్నారు. నేటికీ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న పార్టీ సీపీఎం అని స్పష్టంచేశారు. ప్రజలందరూ పార్టీ నిర్మాణంలో భాగ్యస్వాములు కోరారు. ఈ సందర్భంగా మహేందర్, నరేష్ సీపీఎంలో చేరారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యాదయ్య, మండల కార్యదర్శి శ్యాంసుందర్, నాయకులు కె.శ్రీనివాస్‌రెడ్డి, రావుల జంగయ్య, శర్మ, రమేష్, రాకేష్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లు.. ప్రయాణపు పాట్లు

- దారిపొడవునా గోతులు.. అడ్డుగా ముళ్ల పొదలు
- తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు


ఇర్విన్ రోడ్డు దుస్థితి


మాడ్గుల నుంచి ఆమనగల్లుకు వెళ్లే రహదారిని కమ్మేసిన చెట్లు

మాడ్గుల: గ్రామీణ ప్రాంతాల రహదారులు అధ్వానంగా మారాయి. అసలే ఇరుకు రోడ్లు. ఆపై దారి పొడవునా ఏర్పడిన గోతులతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనచోదకులు పేర్కొంటున్నారు. ఈ మార్గంలో ప్రయాణించాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోందని, కూసాలు కదిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మాడ్గుల మండల పరిధి ఇర్విన్ నుంచి అమనగల్లుకు వెళ్లే ప్రధాన రహదారి పొడవునా గోతులు ఏర్పడి వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం కష్టంగా ఉందని పలువురు తెలిపారు. ఈ మార్గంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. పలువురు గాయాలపాలై ఆస్పత్రి పాలయ్యారని వాపోయారు.

ఇరువైపులా పొదలు..

మాడ్గుల మండలం నుంచి ఆమనగల్లుకు వెళ్లే రహదారికి ఇరువైపులా ఏపుగా కంపచెట్లు పెరిగాయి. రోడ్డుకు అడ్డంగా కొమ్మలు వచ్చాయి. ఇది వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు కష్టంగా ఉందని తెలిపారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన చెందుతున్నారు. ప్రజారవాణాను, ప్రజల అసౌకర్యాన్ని గుర్తించి అధికారులు, పాలకులు రోడ్ల మరమ్మతుకు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

పీఏసీఎస్ చైర్మన్ భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి దోహదపడాలని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం సంఘం కృషి చేస్తుందని, వ్యవసాయ భూములు, పట్టా పాసు పుస్తకాలు ఉన్న రైతులు సంఘంలో ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. రుణమాఫీ కోసం సంఘం పరిధి 641 మంది రైతుల పేర్లను ప్రభుత్వానికి పంపించగా, 252 మందికి మాఫీ అయిందని, మిగతా 329 మందికి కావాల్సి ఉందని పేర్కొన్నారు. జాతీయ రహదారి విస్తరణలో ఎరువుల నిల్వ పాత భవనం కోల్పోవాల్సి వస్తుందని, ప్రత్యామ్నాయంగా మరో చోట భవనం నిర్మించేందుకు సభ్యులు ఆమోదం తెలపాలని కోరారు. గడిచిన ఆరు మాసాల్లో రూ.11 కోట్ల రుణాలు ఇచ్చామని భరత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రుణాలు సక్రమంగా చెల్లించిన రైతులను సత్కరించారు. సంఘం జమాఖర్చుల నివేదికను మేనేజర్ జక్కుల ఐలేష్ యాదవ్ సభ్యులకు చదివి వినిపించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవికుమార్, వైస్ చైర్‌పర్సన్ నార్లకొండ మల్లమ్మ, డైరెక్టర్లు బాలనర్సమ్మ, లక్ష్మమ్మ, చిన్న యాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బాల్‌నర్సింహా, రాములు సిబ్బంది, రైతులు, సభ్యులు పాల్గొన్నారు.


రైతులను సన్మానించిన పాలకవర్గం

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు!

కొరవడిన అధికారుల పర్యవేక్షణ


కొనసాగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో రూ.లక్షలు వెచ్చించి చేపడుతున్న సీసీరోడ్లు, అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించిందని, దీనికి సంబంధిత అధికారులు పర్యవేక్షణ లోపమే కారణమని పలువురు ఆరోపించారు. అలా చేపట్టిన నిర్మాణాలు నెలలు గడవకుండానే పగుళ్లు పడుతున్నాయని పేర్కొంటున్నారు. అయినప్పటికీ.. ఇంజినీరింగ్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. పనులు చేపట్టే సమయంలో అధికారులు.. కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యానికి వదిలేస్తున్నారని, దీంతో నిర్మాణ దారులు నాణ్యత లేని పనులు చేపట్టి, ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మండిపడుతున్నారు. తాజాగా సోమవారం ఇంజాపూర్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న సమయంలో సంబంధిత అధికారులు ఎవరూ లేకపోవడం గమనార్హం. ఇదే అంశంపై ఏఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా, పనులు ప్రారంభం కాకముందే పరిశీలించి వెళ్లామని పేర్కొన్నారు.

గీత కార్మికులకు 'రక్షణ కవచం'

- సేఫ్టీ కిట్‌తో ప్రమాదాలకు చెక్
- ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్


కిట్ల వినియోగంపై శిక్షణ ఇస్తున్న సీఐ బద్యానాథ్ చౌహాన్

కడ్తాల్: గీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం 'కాటమయ్య రక్షణ కవచం' సేఫ్టీ మోకులను పంపిణీ చేసిందని ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ అన్నారు. సోమవారం మండల పరిధి చరికొండ గ్రామంలో సీఐ ఆధ్వర్యంలో కడ్తాల్, మాడ్గుల, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల పరిధి గీత కార్మికులకు, బీసీ సంక్షేమ శాఖ-ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా సేఫ్టీ మోకు ఉపయోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కార్మికులు తాటి చెట్లు ఎక్కే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. వారి రక్షణ కోసం ప్రభుత్వం రక్షణ కవచం కిట్లను అందజేస్తుందని, వాటిని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధి నాలుగు మండలాలకు మొదటి విడతగా 75 కిట్లు మంజూరయ్యాయని తెలిపారు. టీఎఫ్‌టీ లైసెన్స్ కలిగిన వారితో పాటు టాడీ కో-ఆపరేటివ్ సొసైటీస్(టీసీఎస్) సభ్యత్వం ఉన్నవారికి మాత్రమే కిట్లను పంపిణీ చేస్తామని సీఐ స్పష్టంచేశారు. కిట్టులో తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్‌బ్యాగ్, లెగ్‌లూప్ ఉంటాయన్నారు. ప్రస్తుతం వాడే మోకుకు అదనంగా బలమైన రోప్‌ను బిగించడంతో పాటు, కార్మికుల నడుముకు ఉండే ముస్తాదుకు చుట్టూ బెల్ట్ బిగించనున్నట్లు పేర్కొన్నారు. తాటి చెట్టు ఎక్కేటప్పుడు మోకుకు ఉండే సేఫ్టీ రోప్‌ను, వారి నడుముకు ధరించిన బెల్ట్‌కు బిగిస్తారని, తద్వారా చెట్టు ఎక్కేటప్పుడు, దిగే టప్పుడు ప్రమాదవశాత్తు జారి కింద పడకుండా కాపాడుతుందని వెల్లడించారు. కార్యక్రమలో ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణ ప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి మాధవరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రవీందర్, శిక్షణ నిపుణులు వెంకన్న, నరేశ్, నర్సింహ, శ్రీకాంత్, నరేందర్, మధు, ప్రవీణ్, వివిధ గ్రామాల గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తలకొండపల్లి: మండల పరిధి వీరన్నపల్లికి చెందిన బెక్కరి సుప్రీత్‌రెడ్డి ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం వీరన్నపల్లికి వెళ్లారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుప్రీత్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇందులో మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు భూపతిరెడ్డి, నాగమణి, లింగం గౌడ్, జంగమ్మ, మైసయ్య, యాదయ్య, సీనియర్ నేతలు రెణురెడ్డి, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

తలకొండపల్లి: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని ఐసీడీఎస్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తిరుమల అన్నారు. మండల పరిధి వెల్జాల్ సెక్టార్‌లో సోమవారం జూలపల్లి అంగన్‌వాడీ టీచర్ యశోదమ్మ, గట్టు ఇప్పలపల్లి అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, మాదాయిపల్లి కేంద్రంలో పని చేస్తున్న ఆయ బాలమ్మ, వెల్జాల్‌లో ఆయ రామచంద్రమ్మల ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వసంత లక్ష్మి, భూషణమ్మ, పద్మ, నిర్మల, జయమ్మ, కమల, చంద్రకళ, అన్నమ్మ, విజయ, అంజమ్మ, స్వరూప, రాజమణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలశంకర్

మంచాల: చెత్తాచెదారాన్ని బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని, ఇంటి ముందుకు వచ్చే పారిశుద్ధ్య వాహన సిబ్బందికి అందించాలని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. సోమవారం మండల పరిధి కాగజ్‌ఘట్ గ్రామంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యం బాగుండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో తాగునీటి తదితర సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టి తేవాలని, సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉమారాణి, మండల పర్యవేక్షకులు అబ్దుల్ ఆజీమ్, ఎంపీఏ వీరాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి నాగమణి, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి బాసట


సాయం అందజేస్తున్న మిత్రబృందం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆపదలో ఉన్న స్నేహితుడి కుటుంబానికి బాల్య మిత్రులు బాసటగా నిలిచారు. మేమున్నమంటూ చేయూతనిచ్చారు. ఇబ్రహీంపట్నం మండల పరిధి ఎల్మినేడు గ్రామానికి చెందిన మిత్రుడు రాజు భార్య అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో మిత్రులు.. సోమవారం రూ.30 నగదు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం


ఎమ్మెల్యే కసిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించే దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మిషన్ భగీరథ మాజీ వైస్‌చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌లను సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని వారి వారి నివాసాల్లో కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి బికుమాండ్ల నర్సింహ, కోశాధికారి డా.శ్రీనివాస్, సభ్యులు బికుమాండ్ల రమేశ్, వెంకట్, కొ్ట్ర మల్లేశ్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ సత్యనారాయణ, దశరథ్‌నాయక్

కడ్తాల్: ఆటల్లో గెలుపు ఓటములు సహజమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్, ఎంఈఓ సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల పరిధి రావిచేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో 68వ ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి అండర్-14, 17 ఖోఖో పోటీలు నిర్వహించగా.. వారు ప్రారంభించారు. టోర్నీలో కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాల పాఠశాలలకు చెందిన 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి, సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లో రాణించాలని సూచించారు. ఆటల్లో ఆటవిడుపు ముఖ్యమని, క్రీడా స్ఫూర్తితో ఆడిన వారు భవిష్యత్తులో రాణిస్తారని తెలిపారు. ఆత్మవిశ్వాసంతో ఆడి, విజయం సాధించాలని సూచించారు. అనంతరం తలకొండపల్లి, కడ్తాల్ విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీను, ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రటరీ భీముడు, ప్రత్యేక అధికారి విజయ్, పాఠశాల చైర్‌పర్సన్ సువర్ణ, మాజీ సర్పంచ్‌లు వితలయ్యగౌడ్, మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్, నాయకులు రమేశ్‌గౌడ్, ఆంజనేయులు, బాలకృష్ణ, పవన్, మల్లేశ్, యాదయ్య, ఫిజికల్ డైరక్టర్ సాబేర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం


ఇబ్రహీంపట్నం రూరల్: పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు


తలకొండపల్లి: జీపీ కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సైదమ్మ

- కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి
- ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం రూరల్: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఎల్మినేడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 120 పుర సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికుల ఆరోగ్యం బాగుంటేనే, పారిశుద్ధ్య పనులు సవ్యంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. తద్వారా ప్రజల ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఈ సందర్భంగా కార్మికుల కోసం శిబిరం ఏర్పాటు చేసిన ఎల్మినేడు పీహెచ్‌సీ వైద్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు మోహన్, హరికృష్ణ, సూపర్ వైజర్ అజయ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ మోహన్, సిబ్బంది మరియా, ఆశ వర్కర్లు సునిత, అనిత, రాణి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

తలకొండపల్లి: ఆరోగ్య పరిరక్షణకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల శుభ్రత తప్పనిసరి అని డాక్టర్ సైదమ్మ అన్నారు. సోమవారం మండల పరిధి అంతారంలో గట్టుఇప్పలపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు సైదమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు, వారి కుటుంబీలకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించి, అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఎన్‌సీడీ డ్రగ్ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఈఓ ఆంజనేయులు, ఏఎన్ఎం సునీత, పంచాయతీ కార్యదర్శులు శ్రీశైలం, విజయ భాస్కర్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి


సభ్యత్వ నమోదు చేయిస్తున్న బీజేపీ నాయకులు

కడ్తాల్: ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించిందని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కోఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి సూచించారు. అందుకు పార్టీ సభ్యత్వాలను పెంచాలని చెప్పారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు అభియాన్ 2024 నిర్వహించగా.. ఆయన ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేయించారు. అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలు, ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నర్సింహ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భగీరథ్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, నాయకులు మహేశ్, శ్రీశైలంగౌడ్, కుమార్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పట్టభద్రులూ.. ఉద్యోగాలు కల్పించండి

ఓయూ మాజీ వైస్ చాన్స్‌లర్ సత్యనారాయణ



స్నాతకోత్సవ వేదికపై ప్రముఖులు

ఇబ్రహీంపట్నం: ఇంజినీరింగ్‌లో పట్టభద్రులైన వారు.. స్టార్టప్ కంపెనీలు స్థాపించి, ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఓయూ మాజీ వైస్ చాన్స్‌లర్ ఎస్.సత్యనారాయణ ఆకాంక్షించారు. పట్నం సమీపంలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక విద్య పూర్తి చేసిన విద్యార్థులు.. తమ ఆలోచనలకు పదనుపెట్టాలని సూచించారు. ఒకరిపై ఆధార పడకుండా, ఉద్యోగ, ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. సమాజ అభ్యున్నతికి పాటుపడాలని చెప్పారు. కళాశాల చైర్మన్ నాగయ్య మాట్లాడుతూ.. అత్యుత్తమ అధ్యాపకులతో విద్యాబోధన అందిస్తూ.. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ ప్రదీప్‌కుమార్, డైరెక్టర్స్ డాక్టర్ ఈశ్వరప్రసాద్, భగత్, ప్రిన్సిపాల్ శేఖర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, హెచ్ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మోత్యా' సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


మోత్యా చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ నాయకుడు, దివంగత దేపావత్ మోత్యానాయక్ సేవలు చిరస్మరణీయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధి మైసిగండి గ్రామంలో మోత్యానాయక్ దశదినకర్మను పురస్కరించుకుని సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోత్యా చిత్రపటానికి ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాలులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమానికి, మండల అభివృద్ధి మోత్యా ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కమ్లీ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజ్, నాయకులు జవహర్‌లాల్, రాందాస్‌నాయక్, అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.